క్లుప్తంగా

జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం అపహాస్యం


జల్లు ఉషారాణి

వజ్రపుకొత్తూరు: వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు మంగళవారం జరిగిన ఉప ఎన్నికల్లో కూటమి శ్రేణులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా అరాచకాలకు పాల్పడ్డాయని వైఎస్సార్‌సీపీ మండల మహిళా విభాగం అధ్యక్షురాలు జల్లు ఉషారాణి అన్నారు. బుధవారం ఆమె పూండిలో విలేకరులతో మాట్లాడారు. ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి టీడీపీ శ్రేణులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో ఓట్లు వేయించడం, ఓటు హక్కు ఉన్న స్థానికులు పోలీసులు కాళ్లు పట్టుకున్నా ఓటు వేయకుండా ప్రజాస్వామ్యాన్ని పాదాక్రాంతం చేశారని విమర్శించారు. అరాచకాలను, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడాల్సిన ప్రభుత్వ పెద్దలు తిరిగి ప్రతిపక్షంపై బురద జల్లే కార్యక్రమాలకు పూనుకోవడం బాధాకరమన్నారు.

అర్జునాపురంలో వరుణ యాగం


కొండపై పూజలు చేస్తున్న రైతులు

కంచిలి: మండలంలోని అర్జునాపురం గ్రామం పరిధిలో గల బౌద్ధగిరి కొండపై వర్షం కోసం స్థానిక రైతులు వరుణ యాగాన్ని బుధవారం చేశారు. కొద్దిరోజులుగా వర్షాలు కురవకపోవడంతో పంటలు పాడవుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ రైతులంతా వరుణ యాగాన్ని చేపట్టి పూజలు చేశారు.

ఆర్మీ జవాన్ కుటుంబానికి ఆర్థిక సాయం


సాయాన్ని అందజేస్తున్న జవాన్లు

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పద్మనాభపురం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బి.ఈశ్వరరావు ఇటీవల మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న జమ్ముకశ్మీరులో విధులు నిర్వహిస్తున్న ఐటీబీపీ తెలుగు జవాన్లు అండగా నిలిచారు. రూ.91 వేలు మృతునికి కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో జవాన్లు పి.విజయ్, కె.మురళీమోహన్, షణ్ముఖరావు ఉన్నారు.

స్నేహితుల ఔదార్యం


శ్రీనుకు సాయాన్ని అందజేస్తున్న స్నేహితులు

సోంపేట: సోంపేట ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న శ్రీను అనే విద్యార్థి క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు తోటి స్నేహితుడుకి అండగా నిలిచారు. ఇతని కుమార్తె వివాహం కోసం ఆర్థికసాయం చేయాలని సంకల్పించి 60 వేల రూపాయలు సేకరించారు. ఈ మొత్తాన్ని శ్రీనుకు బుధవారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. పూర్వ విద్యార్థులు బీన ఈశ్వరరావు, చిత్రాడ శ్రీను, తామాడ జానకీరావు, కదంబాల రవి, దళముఖ వైకుంఠరావు ఉన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

పలాస: పలాస మండలం కేదారిపురంలో బుధవారం హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎయిడ్స్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ఎంఐసీటీసీ కౌన్సిలరు రామక్రిష్ణ, ప్రోగ్రాం మేనేజరు మాధవరావు, ఎం.హాసన్‌ఉల్లా, వి.కామేశ్వరి, పి.రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు పోటీలు


టెక్కలి: వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

టెక్కలి: స్వాతంత్య్ర దినోత్సవంతోపాటు జిల్లా ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నియోజకవర్గ స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 110 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో ఇందు, చాందిని, శ్రావణి, వక్తృత్వ పోటీల్లో శ్రీవల్లి, హేమకుమార్, రోహిత్, డ్రాయింగ్ పోటీల్లో చైతన్య కిషోర్, తను, దీపిక విజేతలుగా నిలిచారు. వీరంతా జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు.

కవిటి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని పిల్లలకు క్రీడా పోటీలను నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో తదితర పోటీల్లో పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.


పెద్దబొడ్డపాడు వద్ద ఇలా..


అక్కుపల్లి-ఎం.గడూరు మధ్య ప్రమాదకరంగా ఉన్న మలుపు

- ప్రమాదకరంగా రోడ్డు మలుపులు
- తరచూ ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

ఆదమరిస్తే ఆపదే!

వజ్రపుకొత్తూరు రూరల్: ఆ మార్గాల్లో ఏమాత్రం ఆదమరిచి వాహనాన్ని నడిపినా ప్రమాదానికి గురికావడం ఖాయం. పలాస నియోజకవర్గంలోని ఉద్దానం, తీర ప్రాంత రహదారులతో పాటు మరి కొన్ని గ్రామీణ రోడ్లలో ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మలుపుల వద్ద వేగ నిరోధకాలు (స్పీడ్ బ్రేకర్లు), కనీసం హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మలుపులతో పాటు రోడ్డుపైకి పిచ్చి మొక్కలు, జీడి చెట్ల కొమ్మలు విస్తరించడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకొని కొంతమంది ప్రాణాలు కోల్పోతుండగా..మరికొందరు క్షతగాత్రులుగా మిగులుతున్నారు.

ప్రమాదకరంగా ఉన్న మలుపులు ఇవే..

వజ్రపుకొత్తూరు మండలంలోని అక్కుపల్లి నుంచి చీపురపల్లి మీదగా మోట్టూరు, ఒంకులూరు, అనకాపల్లి, ఎం.గడూరు, తోటూరు, రట్టి, ఎర్రముక్కాం, గంగువాడ, బిడిమి, డెప్పూరు, బహాడపల్లి మందస మండలాన్ని కలిపే రహదారుల్లోని మలుపులు భయాన్నిగొల్పుతున్నాయి. అలాగే బెండి గేటు నుంచి బెండి మీదగా సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు, పల్లివూరు, హుకుంపేట, మంచినీళ్లపేట రోడ్లు, పల్లివూరు జంక్షన్ నుంచి పూడి జగన్నాథపురం, పి.ఎం.పురం మీదగా పూండి వరకు, పూండి నుంచి అమలపాడు వరకు, అమలపాడు నుంచి ఉద్దాన రామక్రిష్టపురం మీదగా కొమరల్తాడ రోడ్లలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటితోపాటు మాకన్నపల్లి, బొడ్డపాడు, మామిడిపల్లి, రంగోయి రోడ్లు, బాతుపురం నుంచి చినవంక, చినవంక నుంచి పల్లిసారధి మీదగా తాళబద్ర, వజ్రపుకొత్తూరు నుంచి నువ్వలరేవు మార్గంతోపాటు మందస మండలంలోని గిరిజన గ్రామాల్లో ఉన్న గ్రామీణ రహదారులలో ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి.


ప్రమాదాలను ఆహ్వానిస్తున్న చీపురుపల్లి - ఒంకులూరు రోడ్డు మలుపు

బోర్డులు చోరీకి గురవుతున్నాయి

పలు మలుపులు వద్ద, పనులు జరుగుతున్న రోడ్డులపై ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు చోరీకి గురవుతున్నాయి. సమస్య తమ దృష్టికి వచ్చిన వెంటనే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం. ఆర్‌అండ్‌బీ రోడ్ల పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులు సైతం నిర్వహిస్తున్నాం. ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపడతాం.
– విక్రమ్, ఆర్‌అండ్‌బీ ఏఈ, పలాస

దృష్టిసారించని అధికారులు

రోడ్డు మలుపులు ప్రమాదంగా ఉండడంతో చాలామంది ప్రమాదాలబారిన పడుతున్నారు. అయితే నివారణ చర్యలపై సంబంధిత అధికారులు దృష్టిసారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. మలుపులతో పాటు రోడ్డుపైకి పిచ్చి మొక్కలు, జీడి చెట్లు వ్యాపిస్తున్న విషయం అధికారులకు తెలియని విషయం కాదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద వేగ నిరోధకాలను, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, రోడ్డులపైకి వ్యాపించిన చెట్టు కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



మలుపుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అలాగే స్పీడ్ బ్రేకర్‌లను ఏర్పాటు చేస్తే కొంత వరకు ప్రమాదాలను నియంత్రించవచ్చు. ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.
– బి.భాస్కరరావు, సీతాపురం, వాహనదారుడు, వజ్రపుకొత్తూరు

చెట్ల కొమ్మలతో ప్రమాదాలు



మలుపులు ఉండటంతో పాటు పిచ్చి మొక్కలు, జీడి చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వ్యాపిస్తున్నాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే మలుపుల వద్ద వేగంగా వచ్చే వాహనాలను అదుపు చేయలేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రమాదకర మలుపులను గుర్తించి స్పీడ్ బ్రేకర్లు వేయాలి.
– బి.జిగర్, వాహనదారుడు, నువ్వలరేవు, వజ్రపుకొత్తూరు మండలం

భాగవతంతో ఆధ్యాత్మికత



సామాన్య జనులలో ఆత్మతత్వం, విజ్ఞానాన్ని వ్యాపింప చేయడానికి కథలు, ఉప కథల ద్వారా భాగవతం గొప్ప ఆధ్యాత్మిక విప్లవాన్ని సాధించిందని పురాణ ఇతిహాస ప్రవచనకర్త కె.దాలిరాజు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టి.బరంపురంలో జరుగుతున్న ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమంలో బుధవారం పాల్గొన్నారు. భాగవతం వేదసారాన్ని చిన్న చిన్న కథలు అందించిందని, దానివల్ల సామాన్యజనులు కూడా మానవ జీవితానికి అవసరమైన ప్రయోజనాన్ని సాధించగలరని అన్నారు. ప్రవచనం అనంతరం సీతారామాంజనేయ భజనా బృందం సంగీత కచేరీని నిర్వహించింది. కార్యక్రమంలో తిప్పన ధనుంజయరెడ్డి, దక్కత వాసు, యంపాడ ఉమాపతి, మచంచ నీలాద్రిలు పాల్గొన్నారు. – ఇచ్ఛాపురం రూరల్

పంటలను గమనిస్తుండాలి



ఖరీఫ్ సాగులో పంట ఎదుగుదలను రైతులు రోజూ గమనిస్తుండాలని వ్యవసాయ ఉప సంచాలకులు భవానీశంకరరావు అన్నారు. ఇచ్ఛాపురం మండల వ్యవసాయాధికారి పీపీవీవీ అజయ్ కుమార్‌తో కలిసి బిర్లంగి పంచాయతీలోని పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట ఎదుగుదలతో పాటు పోషక లోపాలు గుర్తించాలని, నీటి నిర్వాహణ, కలుపు నియంత్రణ, పురుగుల నియంత్రణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. – ఇచ్ఛాపురం రూరల్

మాదకద్రవ్య రహిత సమాజాన్ని స్థాపిద్దాం



మాదకద్రవ్య రహిత సమాజస్థాపనే లక్ష్యంగా విద్యార్థులు చైతన్యవంతమైన పాత్ర పోషించాలని కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె సింహాచలం నాయుడు అన్నారు. కళాశాల ఆవరణలో నషాముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా బాలబాలికలతో మాదకద్రవ్యాలతో బుధవారం ప్రతిజ్ఞ చేపించారు. గ్రామీణ ప్రాంత నేపథ్యం కలిగిన విద్యార్థులు తమ సమాజం మేలుకోరే విధంగా మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం అనారోగ్యానికి సూచిక అనే విషయాలను ప్రజలకు చెప్పి వారిలో మార్పుతీసుకురావడంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. కవిటి

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సహకరించాలి


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

సోంపేట: కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నుంచి వైద్య సహకారాలు అందజేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఇటీవల తాళభద్ర పంచాయతీ రాణిగాం గ్రామాన్ని చైర్‌పర్సన్ సందర్శించిన సందర్భంగా గ్రామంలో కిడ్నీ వ్యాధి ప్రబలుతుందని దీనిపై స్పందించాలని స్థానికులు ఆమెకు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆమె జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిని కలిసి సమస్యను తెలియజేశారు. ఈ నేపథ్యంలో అధికారులు స్పందించి రాణిగాం గ్రామ పంచాయతీలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించగా.. జెడ్పీ చైర్‌పర్సన్ సందర్శించారు. గ్రామంలోని ప్రజల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. కిడ్నీరోగులు తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. గ్రామ పెద్దలు ఉగ్రపల్లి తిరుపతిరావు, ఉగ్రపల్లి కృష్ణారావు ఉన్నారు.

మాజీ సీఎం జగన్ దృష్టికి బాధిత క్రషర్ యాజమాన్యం సమస్యలు


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో అజయ్‌కుమార్

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలో కూటమి నాయకుల చేతిలో కక్ష సాధింపు చర్యలకు గురైన క్రషర్ యాజమాన్యం సమస్యలను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు పార్టీకి చెందిన బాధిత క్రషర్ యజమాని కిల్లి అజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని కార్యాలయంలో మంగళవారం జగన్‌ను కలిసినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారనే కారణంగా నియోజకవర్గంలో క్రషర్ యూనిట్లు మూసివేయించారని, అంతే కాకుండా అధికారులు సైతం నాయకులు చెప్పినట్లుగా అడ్డగోలుగా చర్యలు చేపడుతున్నారనే విషయాన్ని అధినేతకు వివరించినట్లు పేర్కొన్నారు.

సారా నిర్మూలనకు కృషిచేయాలి


ఎక్సైజ్ సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న తిరుపతినాయుడు

సోంపేట: నాటు సారా నిర్మూలనకు కృషి చేయాలని ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ తిరుపతినాయుడు అధికారులకు సూచించారు. సోంపేట ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బుధవారం నవోదయం 2.0 కార్యక్రమంపై సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సోంపేట, కంచిలి, మందస మండలాల పరిధిలో నాటు సారా తయారీ గ్రామాలను సారా రహితంగా తీర్చిదిద్దడానికి అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అవసరమైన చోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురళీధర్, సోంపేట, పలాస సీఐలు జి.వి.రమణ, మల్లికార్జున రావు, టాస్క్‌ఫోర్స్ సీఐ మధుకుమార్, ఎస్సైలు కళ్యాణి, సుజాత పాల్గొన్నారు.

కాశీబుగ్గలో క్విట్ కార్పొరేట్ ర్యాలీ


ర్యాలీలో ప్రజాసంఘాల సభ్యులు

పలాస: కాశీబుగ్గ పట్టణంలో బుధవారం వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ మోటారు బైక్, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కాశీబుగ్గ పెంట దాలయ్య ఆశ్రమం నుంచి పాత బస్టాండు, శ్రీనివాస్ లాడ్జి కూడలి మీదగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్ కంపెనీలు ప్రవేశించకుండా ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలను వెంటనే రద్దు చేయాలని, నాలుగు లేబరు కోడ్లను రద్దు చేయాలని కోరారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, ప్రజాసంఘాల నాయకులు మద్దిల రామారావు, ఎస్.గణపతి, టి.సన్యాసిరావు, తెప్పల అజయ్‌కుమార్, తమ్మినేని భాస్కరరావు, బి.వాసు, కె.దుష్యంతు, బి.ఆనందరావు, సీహెచ్ రవి పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం కట్టండి

నందిగాం: తెంబూరు పీఏసీఎస్ పరిధిలోని రైతులందరూ ఈ నెల 20వ తేదీలోగా పంటల బీమా చెల్లించాలని సొసైటీ సీఈవో ఎస్.దాసు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులందరూ బీమా చేయించుకోవాలని.. అందుకు రైతులు తమ 1–బీ, ఆధార్‌కార్డు, బ్యాంకుఖాతా జిరాక్స్‌లు, ఫోన్ నంబర్ తీసుకొని ఎకరాకు రూ. 170 చొప్పున్న సొసైటీలో చెల్లించాలని కోరారు.

స్వచ్ఛ సంకల్పానికి తూట్లు!

- రోడ్ల వెంబడి పేరుకుపోతున్న చెత్త
- పట్టించుకోని యంత్రాంగం


అంపురంలో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం


బలియాపుట్టుగ కాలనీ ఎగువ ప్రాంతంలో జి.జె.కళాశాల పక్కన చెత్త


కంచిలిలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో ఇలా..

కంచిలి: స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర సంకల్పం అనేది క్షేత్రస్థాయిలో కానరానడం లేదు. పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు పారిశుద్ధ్య నిర్వహణ పలు ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా ఉంది. శుభ్రత అనేది ప్రధాన రోడ్లు, ముఖ్యమైన వీధులకే పరిమితమైంది. శివారు ప్రాంతాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కంచిలి మండలంలోని పలు పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిస్థాయిలో జరగడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడికక్కడ పారబోయడంతో అవికుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. చెత్త సేకరణ కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితం అవుతోంది. మిగతావారు ఆ చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను సమీపంలో ఖాళీ స్థలాల్లోను, కాలనీలు, వీధి శివార్లలో పారబోస్తున్నారు. దీని వలన ఆయా ప్రాంతాల సమీపంలో నివసిస్తున్న వారు ఇబ్బందులు పాలవుతున్నారు.


సంపద కేంద్రాలు నిర్వీర్యం!

కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన చెత్తతో సంపద కేంద్రాలు నిర్వీర్యం అయ్యాయి. పంచాయతీల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి, తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరు చేయాల్సి ఉంది. అది క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల నామమాత్రంగా చేపడతున్నారు. మిగతా చోట్ల ఆ షెడ్లు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఉన్నతాధికారులు అడిగినప్పుడు తూతూమంత్రంగా చేసినట్లు ఫొటోలు తీసి వారికి సబ్మిట్ చేసి తర్వాత విడిచి పెట్టేయడంతో వాటి ఏర్పాటు ఉద్దేశం నెరవేరడం లేదనే చెప్పాలి.

చికెన్ వ్యర్థాలతో అవస్థలు

ముఖ్యంగా చికెన్ సెంటర్లు గ్రామస్థాయిలో ఎక్కడికక్కడే వెలిశాయి. ఈ సెంటర్లలో కోళ్ల నుంచి తీసిన వెంట్రుకలు, పొట్టు తదితర వ్యర్థాలను గ్రామ పరిసరాల్లోనే పారబోస్తున్నారు. వీటి నుంచి వచ్చే దుర్వాసనతో అనారోగ్యకరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఎక్కువగా ఈ వ్యర్థాలను వేసిన చోట్ల గ్రౌండ్ వాటర్ కూడా పాడయ్యే పరిస్థి ఏర్పడింది. వ్యర్థాలను తినడానికి కుక్కలు ఎగబడుతున్నాయి. స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటుంటి వాటిపై పంచాయతీ అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు చేపడతాం



పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేందుకు అవసరమైన చర్యలు చేపడతాం. కొన్ని పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీని పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతాం.
– జి.వీరభద్రస్వామి, డిప్యూటీ ఎంపీడీవో, కంచిలి

ఇళ్ల స్థలాలకు దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని చేరీవీధి, అంజనాపురం ప్రభుత్వ లేఅవుట్‌లో ఇళ్ల స్థలాల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పంచాయతీ కార్య నిర్వాహణాధికారి ఎ.వి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 31వ తేదీ సాయంత్రం ఐదుగంటల్లోగా టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. రేషన్, ఆధార్ కార్డుల జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గరుడబద్రలో పారిశుద్ధ్య పనులు

వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్ర పంచాయితీలో సర్పంచ్ గూడ గిరిజ ఆధ్వర్యంలో యంత్రాల సాయంతో బుధవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించి గ్రామానికి దూరంగా తరలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ స్థానికులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గూడ ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, వార్డు సభ్యులు చొక్కర శేషగిరి, వి.ఢిల్లీరావు పనులను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ


ఇచ్ఛాపురం: ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ రమేష్ తదితరులు


పలాస: ర్యాలీలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, సిబ్బంది

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని 'హర్ ఘర్ తిరంగా–హర్ ఘర్ స్వచ్ఛత'కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ చేశారు. కమిషనర్ ఎన్.రమేష్ మాట్లాడుతూ.. ప్రతీ ఇంట జాతీయ పతాకాన్ని ఎగురవేసి జాతిసమైక్యతను చాటుకోవాలన్నారు. వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్నాథం, మున్సిపల్, మెప్మా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. జాతీయ పతాకాలను చేతపట్టి దేశభక్తి నినాదాలతో ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం అధికారులు కొండల మధుబాబు, తమ్మినేని వాసుదేవరావు, తమ్మినేని పాపారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.


టెక్కలి: ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో..

టెక్కలి: బీజేపీ ఆధ్వర్యంలో టెక్కలి పట్టణంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు జె.రామ్‌జీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో ర్యాలీ చేపట్టారు. ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కోరారు. నాయకులు ఎస్.తేజేశ్వరరావు, పూడి తిరుపతిరావు, పి.వేణుగోపాల్, ఎ.రవిబాబ్జీ, ఎస్.ఉమామహేశ్వరి, విజయానందరెడ్డి, బి.ఉమామహేశ్వరరావు, ఎస్.లక్ష్మీనారాయణ, రాజ్‌కుమార్‌రెడ్డి, పరమేశ్వరరావు పాల్గొన్నారు.